క్లుప్తంగా

నేడు మండల సమావేశం

అడ్డతీగల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో పి.రంగారావు తెలిపారు. ఎంపీపీ బొడ్డపాటి రాఘవ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు విధిగా హాజరుకావాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చ నిర్వహించనున్న దృష్ట్యా ఆయా శాఖలకు సంబంధించిన వివరాలను తీసుకుని సమావేశానికి రావాలన్నారు.

గురుపౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు

రాజవొమ్మంగి: గురుపౌర్ణమి వేడుకలకు మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి బాబా వారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన, పల్లకిసేవ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పురోహితుడు భానుమూర్తి తెలిపారు.

ఘనంగా ముగిసిన రథయాత్ర



కొండపడలో జగన్నాథస్వామి రథం లాగుతున్న భక్తులు

ముంచంగిపుట్టు: ఏనుగురాయి పంచాయతీ కొండపడ గ్రామంలో సోమవారం రథయాత్ర ఘనంగా ముగిసింది. రథంపై జగన్నాథ స్వామి ప్రతిమలను ఏర్పాటు చేసి రథయాత్ర నిర్వహించారు. అధిక సంఖ్యల్లో భక్తులు వచ్చి రథయాత్రలో పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. దీంతో పాటు ఏవోబీ సరిహద్దు ప్రాంతమైన ఓనకఢిల్లీలో సైతం రథయాత్రను సరిహద్దు గిరిజనులు సైతం ఘనంగా ముగించారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ గంగరాజు

అనంతగిరి: మండలంలోని కాశీపట్నం పంచాయతీ సారవానిపాలెంలోని సోమవారం జెడ్పీ నిధులు రూ.3లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ గంగరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీసీ రోడ్డు లేకపోవడంతో గతంలో ఈ ప్రాంతంలోని గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో సంతోషం ఉందన్నారు. సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ప్రజాప్రతినిధులు



కలెక్టర్‌ను కలిసిన ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి తదితరులు

రంపచోడవరం: జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌ను రంపచోడవరం ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, ఎంపీటీసీలు వంశీ కుంజం, తుర్రం వెంకటేశ్వర్లుదొరలు తదితరులు సోమ వారం మర్యాదు పూర్వకంగా కలిశారు. గతంలో ఐటీడీఏ పీవోగా పనిచేసిన అనుభవంతో ఏజెన్సీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు పండా రామకృష్ణదొర తదితరులున్నారు.


సంపద కేంద్రాలతో అదనపు ఆదాయం

మునగపాక : సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని ఈవోఆర్డీ వెంకటలక్ష్మి అన్నారు. తిమ్మరాజుపేటలో సంపద తయారీ కేంద్రాన్ని ఆమె సోమవారం సందర్శించారు. కేంద్రాల్లో తయారయ్యే వర్మి కంపోస్టు ద్వారా మంచి ఫలితాలు సాధించాలన్నారు. గ్రామంలో రక్షిత మంచినీటి పథకాన్ని కూడా పరిశీలించారు.

నిరుద్యోగుల నిరీక్షణ

ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు ప్రతి ఇంటికో ఉద్యోగం, లేదా నిరుద్యోగులకు రూ.3 వేల భృతి ఇస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా సూపర్ సిక్స్ పథకాల్లో నిరుద్యోగ భృతిని మొదటి హామీగా పేర్కొన్నారు. రోజులు గడుస్తున్నా.. ఈ హామీ ఇంకా అమలు కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన నాటి నుంచి ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి ఎప్పుడు వస్తుందని ఎంతో ఆశతో నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు.

- ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి ఇస్తామన్న చంద్రబాబు
- ఇంకా అమలు కాని హామీ
- ఆశగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులు



అనంతగిరి/అరకులోయ టౌన్/అరకులోయ రూరల్/జి.మాడుగుల/చింతపల్లి రూరల్/చింతూరు/కూనవరం/మోతుగూడెం/వీఆర్ పురం: ప్రతి ఇంట్లో నిరుద్యోగులు చంద్రబాబు ఇచ్చిన హామీ ఎప్పుడు అమలు చేస్తారా.. అసలు చేస్తారా.. చేయరా.. చేస్తే ఎప్పటి నుంచి అమలు చేస్తారు.. ఇంటికో ఉద్యోగం ఇస్తారా.. ఒకవేళ నిరుద్యోగ భృతి ఎంత ఇస్తారు వంటి సందేహాలతో యువత సతమతమవుతున్నారు.

సందిగ్ధంలో నిరుద్యోగులు

2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ అప్పుడు కూడా ఎన్నికల ప్రచారంలో జాబు కావాలంటే.. బాబు రావాలి, ఇంటికో ఉద్యోగం, లేదంటే..ప్రతి నెల రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీలిచ్చింది. కానీ ఎక్కడా కార్యరూపం దాల్చలేదు. ఇంటికో ఉద్యోగం మాట దేవుడెరుగు, కనీసం నిరుద్యోగ భృతి కూడా ఇవ్వకుండా మొండిచెయ్యి చూపారు. గత అనుభవంతో ఈసారైనా హామీ అమలుచేస్తారా లేదా మొండి చెయ్యి చూపిస్తారా అనే సందిగ్ధంలో నిరుద్యోగులు ఉన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో సుమారు 5 లక్షల మంది నిరుద్యోగులకు కార్యదర్శులు, వలంటీర్లుగా నియమించిన విషయం తెలిసిందే. మరి చంద్రబాబు ప్రభుత్వం ఏమేరకు ఉద్యోగాలు కల్పిస్తుందోనని యువత ఆశగా ఎదురు చూస్తున్నారు.

అరకు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సుమారు 12వేలమంది పైగా ఉన్నత చదువులు అభ్యసించారు. నియోజకవర్గంలో అనంతగిరి, అరకువేలి, డుంబ్రిగుడ, ముంచంగిపుట్టు, హుకుంపేట,పెదబయలు ఆరు మండలాల్లో నిరుద్యోగులు భృతి కోసం ఎదురుచూపులు చేస్తున్నారు. ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం భృతితో భరోసా నిస్తామన్నారు.. నేటికి స్పష్టమైన హామీ లేకపోవడంతో నిరుద్యోగుల్లో ఆందోళన నెలకొంది.

చింతూరు మండలంలో సుమారుగా 8 వేల మంది నిరుద్యోగులు ఉన్నారు. వారిలో అన్ని అర్హతలు ఉండి ఉద్యోగాలు లేక ఇబ్బంది పడుతున్న వారి సంఖ్య 5వేలు ఉన్నారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన నిరుద్యోగ భృతి కోసం మండలంలో సుమారు 7 వేలమంది వరకు నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వ హామీ మేరకు తమకు ఉద్యోగాలు కల్పించాలని లేకుంటే నిరుద్యోగ భృతి అయినా ఇవ్వాలని వారు కోరుతున్నారు. కొయ్యూరు మండలంలోని మొత్తం గృహాలు 5342 ఉండగా.. నిరుద్యోగులు సుమారు 3500 పైగా ఉన్నట్టు తెలిసింది.

ఉద్యోగం లేదు.. భృతి లేదు...



కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇవ్వడంపై నేటికి స్పష్టత ఇవ్వలేదు. ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో ఇంట్లోనే నిరుద్యోగులుగా మిగిలిపోయి, ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం.. నిరుద్యోగ భృతి అమలుచేయాలి.

– పట్టాసి అర్జున్‌రావు, నిరుద్యోగి, పెదబయలు మండలం

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలి. తాము అధికారంలోకి వస్తే ఏటా 20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామి ఇచ్చారు. సూపర్ సిక్స్ పేరిట మెనిఫెస్టో పెట్టారు. తాము ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు లేక రోడ్డున పడి ఉన్నాం. ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగ నియామకాలు జరపాలి.

– బంగురు విజయ్‌కుమార్, బెడ్డగుడ గ్రామం, పద్మాపురం పంచాయతీ, అరకులోయ మండలం

ఉద్యోగ నియామకాలు చేపట్టాలి



రాష్ట్రంలో నిరుద్యోగుల కోసం స్పెషల్ డీఎస్సీ ఎప్పుడు నియమిస్తారో కూటమి ప్రభుత్వం ప్రకటించాలి. ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం శిక్షణ పొంది వేచి ఉన్నాం. 2024 ఎన్నికల హామీలో ఇచ్చిన ప్రకారం స్పెషల్ డీఎస్సీ వెంటనే నియమించాలి. మా లాంటి నిరుద్యోగులుకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.

– శెట్టి సుశీల, బికాం. డిఈడి, మాదల గ్రామం అరకులోయ మండలం.

ఇంటికో ఉద్యోగం ఏది?



సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం, లేదా నిరుద్యోగ భృతి ఇస్తామని చంద్రబాబునాయుడు వాగ్దానాలు ఇచ్చారు. దీంతో నిరుద్యోగులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. చంద్రబాబు హామీ అమలు కాకపోవడంతో సతమతమవుతున్నాం. ఇప్పటివరకు ఒక్క హామీ అమలకు నోచుకోలేదు.

– కర్రినాయుడు, ,చిలకలపాలెం, జి.మాడుగుల మండలం

భృతి ఇచ్చి ఆదుకోవాలి



కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి కుటుంబానికి ఉద్యోగం గాని నిరుద్యోగ భృతి గాని తక్షణమే ఇవ్వాలి. పేద గిరిజన నిరుద్యోగులు ఆశతో ఎదురుచూస్తున్నారు. ఏజెన్సీలో గిరిజన నిరుద్యోగుల కోసం ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ తీయాలి.ఖాళీ ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి. ఇచ్చిన హామీలు అమలుచేయాలి. – వంతల బాలరాజు, మల్లవరం, చింతపల్లి మండలం

ఆశగా ఎదురుచూపులు



బీకాం, బీఈడీ చేసిన నేను ఉద్యోగావకాశాలు లేక ఉపాధి కోసం చిన్నపాటి వ్యాపారం చేసుకుంటున్నాను. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు భృతి ఇస్తానని హామీనివ్వడం జరిగింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రకటించిన నిరుద్యోగ భృతికోసం ఎదురుచూస్తున్నా.

– కంటు అచ్యుత్‌రావు, మోతుగూడెం, చింతూరు మండలం

నిరుద్యోగ భృతిపై స్పష్టత ఇవ్వాలి



ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి వస్తుందని గంపెడు ఆశలతో ఎదురు చూస్తున్నాను. కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు దాటినా నిరుద్యోగ భృతిపై స్పష్టత ఇవ్వక నిరుద్యోగులు నిరాశ గురవుతున్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి. ఎప్పటి నుంచి రూ. 3000 భృతి ఇచ్చేది స్పష్టం చేయాలి,

– కరక అనిల్, కరకగూడెం, కూనవరం మండలం

విధి విధానాలు ప్రకటించాలి



ఎన్నికలకు ముందు కూటమి పార్టీ మేనిఫెస్టోలో నిరుద్యోగులకు ప్రతీ నెల రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తానని ప్రకటించింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు దాని అమలుపై, విధివిధానాలపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. నేను డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నాను. నిరుద్యోగ భృతి లాంటిది ఇస్తే నాలాంటి వారెందరికో ఉపయోగమవుతుంది.

– పలివెల పవన్‌సాయి, వీఆర్ పురం

నిరుద్యోగ భృతి ఇవ్వాల్సిందే



కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేయకుండా జనరల్ అభ్యర్థులతో సహ అందరికీ నిరుద్యోగ భృతి ఇవ్వాల్సిందే. ఉద్యోగాలు కల్పించే వరకు నిరుద్యోగులకు భృతి ఇస్తే వారి కుటుంబాలకు ఎంతో తోడ్పాటు ఇచ్చినట్లు అవుతుంది. ఉద్యోగాల కోసం గిరిజన యువత ఎదురుచూస్తున్నారు.

– పోతల ప్రసన్న సాయి, చింతపల్లి గ్రామం

కలెక్టర్ దృష్టికి గ్రామ సమస్యలు



కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసిన సర్పంచ్‌లు

రాజవొమ్మంగి: రంపచోడవరంలో సోమవారం పర్యటించిన అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌ను మండలంలోని పలువురు సర్పంచ్‌లు కలిశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వివరించారు. ప్రధానంగా జడ్డంగి మీదుగా జరుగుతున్న ఎన్‌హెచ్ 516ఈ. రహదారి విస్తరణ పనుల్లో ఇళ్ల స్థలాలు, ఇళ్లు, భూములు కోల్పోయిన అనేక మందికి ఇంకా నష్టపరిహారం అందలేదని సర్పంచ్ కొంగర మురళీ కృష్ణ కలెక్టరుకు తెలిపారు. తంటికొండ వద్ద దెబ్బతిన్న కల్వర్టులు, డ్రైనేజీ సమస్యను సర్పంచ్ ఆగూరి శుభలక్ష్మి కలెక్టరుకు తెలియజేశారు. దోనెలపాలెం– గొబ్బిలమడుగు రహదారి పనులు ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉన్నాయని, సమస్య పరిష్కరించాలని సర్పంచ్ సవిరెల చంద్రుడు కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ దినేష్‌కుమార్ త్వరలో జడ్డంగిలో గ్రామ సభ నిర్వహించి హైవే విస్తరణలో స్థలాలు కోల్పోయిన వారి వివరాలు సేకరిస్తానని, న్యాయం చేస్తానని , సమస్యలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్ తొంటా ఆదిరాజు, కో–ఆప్షన్ మెంబర్ కామేష్ పాల్గొన్నారు.

ఆలయంలో నగదు చోరీ



వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో దొంగలు పగలుగొట్టిన హుండీ

రాజవొమ్మంగి: స్థానిక శివాలయం కొండపై గల పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయంలో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఆలయంలో హుండీలను దొంగలు పగులగొట్టి అందులోని నగదు తస్కరించినట్టు పలువురు తెలిపారు. ఆలయంలో ప్రవేశించేందుకు దొంగలు తలుపులు పగలగొట్టి, గొళ్లాలు ఊడతీసారన్నారు. ఇదే కొండపై వేంచేసి ఉన్న దుర్గమ్మ ఆలయంలోని వారం రోజుల క్రితం జరిగిన ఘటనలో దొంగలు హుండీని నగదు దోచుకుపోయిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా రాజవొమ్మంగిలో ఇటీవల చైన్ స్నాచర్లు ఇద్దరు మహిళల మెడలోని బంగారు గొలుసులు తెంపుకొని పరారైన ఘటన తెలిసిందే. అలాగే కోళ్ల దొంగతనాలు, ఇతరత్రా అనేక దొంగతనాలు జరుగుతున్నా పోలీసు అధికారులు పట్టించుకోడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జరిగిన దొంగతనాలపై సమగ్ర విచారణ జరపాలని, గట్టి నిఘా ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

అధ్వానంగా కార్యాలయ ప్రాంగణం



ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు

అరకులోయ రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయం అధ్వానంగా దర్శనిమిస్తుంది. కార్యాలయం ఆవరణలో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాలు పేరుకుపోయాయి. కార్యాలయంలోనికి వెళ్లేందుకు దారి పిచ్చిమొక్కలతో నిండి ఉంది. వివిధ పనులపై కార్యాలయానికి వస్తున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమలు, కీటకాల బెడద ఎక్కువైందని స్థానికులు చెబుతున్నారు. విష సర్పాలు ప్రాంగణంలో ప్రవేశించే అవకాశాలున్నాయని ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురుస్తుండడంతో పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త, పిచ్చిమొక్కలను తొలగించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

వర్షానికి కూలిన పెంకుటిల్లు



లువ్వాసింగిలో వర్షానికి కూలిన పెంకుటిల్లు వద్ద బాధితుడు సూరిబాబు

జి.మాడుగుల: మండలంలో లువ్వాసింగి పంచాయతీ కేంద్రంలోని మూడు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి ఓ గిరిజనుడి పెంకుటిల్లు కూలింది. లువ్వాసింగి గ్రామానికి చెందిన జర్రా సూరిబాబుకు చెందిన పెంకుటిల్లు వర్షానికి మట్టి గోడలు తడిచిపోయి సోమవారం మధ్యాహ్నం కూలినట్లు స్థానికులు తెలిపారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరని, త్రుటిలో ప్రమాదం తప్పిందన్నారు. ఇంట్లో బియ్యం, ఇతర సామగ్రి వర్షానికి తడిచిముద్దాయ్యాయి. ఇంటికి సంబంధించిన పెంకులు పూర్తిగా ధ్వంసమైనట్టు చెప్పారు. సుమారు లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని బాధితుడు సూరిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకొని తగిన నష్టపరిహారం అందించి, పక్కా ఇల్లు మంజూరు చేయాలని కోరారు.

మలేరియా నివారణకు చర్యలు



వంగసారలో దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

చింతపల్లి రూరల్: మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో వీరసాయి బాబు అన్నారు. మండలంలో కొత్తపాలెం పంచాయతీ వంగసార గ్రామంలో ఇంటింటా దోమల మందు పిచికారీ పనులు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వీరసాయిబాబు మాట్లాడుతూ ఇంటి వద్ద నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలని, ఆరోగ్య సమస్యలుంటే సమీపంలోని ఆస్పత్రిలో సంప్రదించాలని సూచించారు. ఏవో శ్రీనివాస్, మలేరియా అధికారుల పాల్గొన్నారు.

గ్రామాల్లో విస్తృతంగా సర్వే

గిరిజన గ్రామాల్లో మలేరియా ప్రబలకుండా ఆరోగ్య శాఖ ప్రత్యేక మాస్ సర్వే నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ప్రతి ఇంటికి ఆశా కార్యకర్తలు, సీహెచ్‌డబ్ల్యూవోలు వెళ్లి రక్త పూతలు సేకరించి, మలేరియా, డెంగ్యూ తదితర పరీక్షలు చేస్తున్నారు.ఇందులో భాగంగా సోమవారం మండల కేంద్రంలో సాయినగర్ వీధిలో ఇంటింటికీ వెళ్లి రక్తపూతలు సేకరించారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి

పెదబయలు: మండలంలో రోజురోజుకు దొంగతనాలు పెరుగుతున్నాయని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జి.మాడుగుల సీఐ రమేష్, పెదబయలు ఎస్‌ఐ మనోజ్‌కుమార్ చెప్పారు. వారు సోమవారం మాట్లాడుతూ గ్రామం నుంచి బయటకు వెల్లేటప్పుడు విలువైన వస్తువులు భద్రపరుచుకోవాలని, ఎక్కువ రోజులు వేరే ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే పోలీసు స్టేషన్‌కు సమాచారం అందిస్తే ఇంటికి సంబంధించి పోలీసులు నిఘా ఉంటుందన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ఇంట్లో విలువైన వస్తువులు, నగదు గృహంలో ఉంచవద్దని సూచించారు. షాపులకు సీసీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు. అనుమానస్పదంగా ఎవరైన అపరిచితులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు కోరారు.

దొంగతనాల కట్టడికి చర్యలు

వరుస దొంగతనాలపై పోలీసు నిఘా పెంచడం జరిగిందని. రాత్రిళ్లు కూడా గస్తీ నిర్వహిస్తామన్నారు. అవసరమైన వారు ప్రతీ ఇంట్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే ఇప్పటి వరకు జరిగిన చోరికి సంబంధించి క్లూస్ టీం పరిశీలిస్తోందని, దొంగలను పట్టుకుంటామన్నారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే 9440904227, 9440332756 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ముంచంగిపుట్టు: పెదబయలు మండలంలో జరుగుతున్న దొంగతనాలతో ముంచంగిపుట్టు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రవీంద్ర కోరారు. ఆయన సోమవారం మాట్లాడుతూ వేరే ప్రాంతాలకు వెళ్లే ఇంటి వద్ద ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇంట్లో విలువైన వస్తువులు, నగదులను ఉంచవద్దన్నారు. గ్రామాల్లో అనుమానంగా తిరుగుతన్న వ్యక్తులపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ముఖ్యంగా షాపుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.దొంగతనాల నివారణ కోసం పోలీసులకు మండల ప్రజల సహకరించాలని ఆయన కోరారు.

106 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



సీహెచ్‌సీలో గిరిజన మహిళలకు పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో స్థానిక సీహెచ్‌సీలో హైదరాబాద్‌కు చెందిన వైఎస్ జయమ్మ మెమోరియల్ ట్రస్ట్, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొబైల్ వ్యాన్‌లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. మండలంలో వివిధ గ్రామాల నుంచి గిరిజనులు తరలివచ్చి పరీక్షలు చేసుకున్నారు. వారి వివరాలను సిబ్బంది నమోదు చేసుకున్నారు.

ప్రత్యేక వైద్య నిపుణులు మణికంఠ, గౌతమ్‌లు 106 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. క్యాన్సర్ లక్షణాలు ఉన్న కొంతమందికి తగు జాగ్రత్తలను సూచించారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని, ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు చెప్పారు. వాతావరణంలో మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యులు గీతాంజలి, శిరీష, ముంచంగిపుట్టు, కిలగాడ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గాబాయి దేశ్‌ముఖ్‌కు ఘన నివాళి



దుర్గాబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం వరలక్ష్మి, ఉపాధ్యాయులు

గంగవరం : ఉక్కు మహిళ దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతిని స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రోలుపల్లి వరలక్ష్మి ఆధ్వర్యంలో దుర్గాబాయి చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థినులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వరలక్ష్మి, ఉపాధ్యాయులు ఉమాదేవి, రాధాకుమారి, లలితా, లక్ష్మి, రూప, భవానీ, విజయ తదితరులు మాట్లాడారు. దేశభక్తురాలిగా, స్వాతంత్ర్య సమరయోధురాలిగా, సంఘసంస్కర్తగా, సంఘ సేవకురాలిగా, రచయిత్రిగా, వక్తగా, బహుముఖ ప్రజ్ఞావంతురాలిగా గుర్తింపు పొందిన వ్యక్తి దుర్గాబాయి దేశ్‌ముఖ్‌గా అభివర్ణించారు. డిప్యూటీ వార్డెన్ లావణ్య, ఏఎస్‌ఎం చెల్లాయమ్మ , పీడీ నాగమణి, పీఈటీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉపాధి పనులు



మాట్లాడుతున్న అధికారి శ్రీరాంగోపాల్

చింతపల్లిరూరల్: అర్హులందరికీ ఉపాధి ఉపాధి హామీ పథకం పనులు కల్పిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని ,పోగ్రం ఇంప్లిమెంటేషన్ అధికారి శ్రీరాంగోపాల్ అన్నారు.స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్‌లతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామంలో ఉపాధి హామీ వేతనదారులకు 100 రోజులు పనులు కల్పిస్తున్నామన్నారు. ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు ఉన్నావారు 150 రోజులు పని దినాలను కల్పించామని, హార్టీకల్చర్ ప్లాంటేషన్ పనులు త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలి ఆయన కోరారు. ఎంపీడీవో వీరసాయిబాబు, ఏపీవో మూర్తి, ఈసీ మధుసూదన్ పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యంతోనే ఉన్నత శిఖరాలు



వృత్తి నైపుణ్య శిక్షణ పూర్తి చేసిన యువతిని సత్కరిస్తున్న సమంత్‌కుమార్‌రెడ్డి

అనకాపల్లి : నిరుద్యోగ యువత సమయాన్ని వృథా చేసుకోకుండా వృత్తిలో నైపుణ్యం సాధించాలని నాబార్డ్ డీడీఎం సమంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక భారతీయ స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. వరల్డ్ యూత్ స్కిల్ డేను పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషిలో ఏదో ఒక నైపుణ్యం ఉంటుందన్నారు. దాన్ని వెలికి తీసినప్పుడు మనిషి ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరు స్వయం ఉపాధితో అభివృద్ధి సాధించాలన్నారు. అనంతరం గతంలో సంస్థలో శిక్షణ పొంది స్థిరపడిన యువతను సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఎస్‌బీఐ ఎల్‌డీఎం శ్రీనివాసరావు, సంస్థ డైరెక్టర్ బి.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.